అవసరాలు సమకూర్చడంతోనే వారికి సరిపోయింది. ఆడబిడ్డలు చవకరకం పట్టుచీరెలు కట్టారు. అత్తగారైతే, తన అత్తగారి కాలంనాటి నలిగిపోయి శిథిలావస్థలో వున్న పట్టుచీరెలు కట్టింది. భోజనం టైమ్‌లో మంచి జరీచీర కట్టడంపోయి మడి పట్టుచీర కట్టింది. మరి వారికిచ్చిన లాంచనాలు ఏమైనట్లు? వారి వారి భర్తలు స్వాహా చేసారా?'

తను సారె చీరెలతో అత్తవారింట అడుగు పెట్టింది. మంచి మంచి చీరెలు అత్త ఆడబిడ్డల కిచ్చింది. వారెంతో మురిసిపోయారు.

'భర్త శ్రీనివాసు. కొద్ది రోజులు డబ్బు ప్రసక్తే తేకుండా కులాసాగానే గడిపాడు. ఆ తరువాత ఓ రోజు అడిగాడున వ్వుతూనే. "నీకు వంద తులాల బంగారం వుందన్నారు' ఏం చేశావ్?"

"ఆ నగలు పూర్వ కాలంవి. ఎప్పుడైనా సరదాకి పెట్టుకొనేవేగాని నిత్యం పెట్టుకుని నలుగురిలోనూ తిరిగేవికావు. నవ్వుతారు. ప్రమాదం కూడా. అందుకని బేంకిలో దాచుకున్నా"నంది.

"మరి పొలాల మీద వచ్చే సొమ్ము?"

"అదీ నా పేర బేంకిలో ఉంది."

"ఏం చేస్తావు దానితో?"

"మా నాన్నగారు దానితో మళ్ళీపొలమో తోటో కొని ఆస్థి పెంచుతారు."

"పెళ్ళయాక కూడా వారి పెత్తనమేమిటి?"

"వారి పెత్తనం లేదు. ఇహ నాదే పెత్తనం."

"నీ పెత్తనమేమిటి?పెళ్ళయ్యాకనీ మీదా నీ ఆస్తిమీదా నాదే పెత్తనం?" అన్నాడు. చిరునవ్వుతో హాస్యానికన్నట్లు.

"నేనియ్యాలికదా" అంది అదే చిరునవ్వుతో.

"నీవియ్యడమేమిటి? నీవారే నిన్ను ఆస్థి నగలుతో నాకిచ్చారు."

"నన్ను మీకిచ్చినా, ఆస్థి, నగలు నాకే యిచ్చారు"

"నువు నాదానవైనపుడు, నీది నాది కాదా?"

"దానికి కొంత సమయం పడుతుంది. పెళ్ళిలో మంత్రాలు చదివి మీరు నావాడుగా నేను మీ దానిగా కావడం నాంది మాత్రమే. కొన్ని సంఘటనలు, సన్నివేశాలు, మన ప్రవర్తన, చిత్తశుద్ధి దానిని బలపర్చాలి. కొంత కాలం జరగాలి"

'అమ్మో గట్టి పిండమే' అని మనసులో అనుకుని వుంటారు.అప్పటికి ఊరుకొన్నారు.

చిరునవ్వులతో సాగిన ఆనాటి సంభాషణావిషయం, రోజు రోజుకు రాజుకొని, ఆవేశ కావేషాలను పెంచింది. శ్రుతి మించి రాగాన పడింది.

పుట్టింటి నుంచి సొమ్ము, నగలూ తెమ్మని వాసూ, ఇష్టం వున్నపుడు అవసరం వచ్చినప్పుడు తెచ్చుకుంటానని తానూ, రోజూ వాదోపవాదాలు.

చివరికి పుట్టింటికి వెళ్ళి నగలు, డబ్బు, తెస్తేగాని వీల్లేదన్నాడు. "లేకపోతేనో"— "అక్కడే వుంటావు" అన్నాడు.

'థేంక్ గాడ్! చంపే వుద్దేశ్యం లేదన్న మాట!' పెళ్ళికి ముందు రాధ హెచ్చరికలు గుర్తొచ్చి మనసులో నవ్వుకొంది. ఆ తరువాత."నేనిప్పట్లో తేను" అంది మొండిగా. "నేను చెప్పినట్లు చేస్తే చెయ్యి లేకపోతే గెటౌట్" అన్నాడు ఆవేశంగా.

'అక్కడే తొందరపడ్డాడు. తాను అవాక్కయింది. క్షణం ఉండరాదా ఇంట్లో' అనుకొంది పెట్టెలో చేతికి దొరికిన చీరలు సర్ది— ముందు హాల్లో కొచ్చింది. చెప్పి వెళ్ళడానిక త్తమామలు ఇంట్లో లేరు. గడప దాటే ముందు కాస్త తమాయించుకుని ఆగి వెనక్కి తిరిగి చూసింది. అతడలా చూస్తూ ఉండిపోయాడేగాని వారించలేదు.

"మీరు పొమ్మన్నాక మళ్ళా తిరిగి మీ ఇంటికి వచ్చేది లేదు. నేను కావాలనుకుంటే. మీరే నా దగ్గరకు రావలసి వుంటుంది" అనేసి గుమ్మం దాటింది. పుట్టింటికి వచ్చేసింది.

తండ్రి చాలా బాధపడ్డాడు. తనకి తెలియకుండా కొంత డబ్బు పట్టికెళ్ళి ఇచ్చి అల్లుణ్ని బతిమాలాడు. "నువ్వు నీ డబ్బూ కాదు. నీ కూతురు— ఆమె డబ్బు రావాలి" అన్నాడట. తాను ససేమిరా వెళ్ళనంది. "పల్లెటూరు అల్లరమ్మా"అని వాపోయారు తలిదండ్రులు.

'తాను పట్నం వచ్చేసింది. బేంకిలో డబ్బు తీసి బంగాళా కొంది ఇదే పట్నంలో యూనివర్శిటీలో చేరింది. స్నేహితురాళ్ళని సహాయంగా పెట్టుకుని చదువు సాగిస్తోంది తనకి సంతోషమూ లేదు. దుఃఖమూ లేదు. తను పుట్టింటా లేదు. అత్తింటా లేదు కాని ప్రతీది బరువుగా వుంటోంది. ఈ మంగళ సూత్రాలింత బరువా?.'

ఆలోచనల బరువులో అలసిపోయి మత్తుగా కళ్ళు మూసుకొంది మాధవి.

* * *

ఆ మరునాడు కాక మూడోనాడు అత్తగారు వచ్చింది

## కాలమ్ వాటని కథ




కమల, విమల చిన్నప్పటి నుంచి ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకునే అంతటి ఫ్రెండ్స్!

"పుణ్యం కొద్ది పురుషుడు" అన్నట్లుగా ఇద్దరికీ ఒక ఊళ్ళోనే ఉద్యోగం చేసే మంచి భర్తలు లభించేరు.

ఒకసారి కమల,విమల కూడబలుక్కుని తమ పుట్టిళ్ళకు ఉత్తరాలు వ్రాసేరు. అక్కడ చింతపండు దొరకటం లేదనీ. ఊరగాయలు పెట్టుకునే సౌకర్యం లేదనినీ చింతపండు, ఊరగాయలు తెచ్చిపెట్టమని వ్రాసేరు.

ఇద్దరి తండ్రులు తమ కుమార్తెల ఇళ్ళకు వచ్చారు.

కమల నాన్నగారు:

## చెప్పుకోండి చూద్దాం!

"అమ్మాయీ బాగున్నావా! అ స్మమానూ నిన్ను తలుస్తూనే వుంటామనుకో, నిన్ను చూడకపోతే మాకేమీ తోచదు! నువ్వు చింతపండు, ఊరగాయలు తెమ్మని వ్రాసేవు కాని ఈ సంవత్సరం ఎక్కడా పంట సరిగ్గా లేదమ్మా!నేను మీ అమ్మ ఎంతో బాధ పడ్డాము నీకు ఏమీ తీసుకురాలేక పోయినందుకు!" అన్నారు ప్రేమగా.

విమల నాన్నగారు:

"విమలా నీకు చాదస్తం ఎక్కువయిందే! ఈ చింతపండుకోసం ఎంత అవస్థపడ్డానో తెలుసా! ఈ ఊరగాయలు, చింతపండు మోసుకు వచ్చేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చిందనుకో! ఇవి లోపలపెట్టు" అన్నారు విసుగ్గా!!

ఇదీ సంగతి. ఎవరి ప్రేమ గొప్పదో చెప్పుకోండి చూద్దాం!!

—జయంతి కాశీ అన్నపూర్ణ